క్రీస్తుమార్గం.. కరుణకు ప్రతిరూపం..

'గుడ్‌ఫ్రైడే' ప్రార్థనల్లో దైవ సందేశకులు

కరుణకు ప్రతిరూపం క్రీస్తు అని దైవ సందేశకులు పేర్కొన్నారు. ఆయన చూపిన శాంతి, ప్రేమ, కరుణ మార్గాల్లో పయనించాలని ఆకాంక్షించారు. ఏసు త్యాగానికి గుడ్‌ఫ్రైడే ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అందుకని ఆయన మాటలను సర్వదా ధాన్యించాలని ఉపదేశించారు. సిలువలో ఆయన పలికిన ఏడు మాటలు ధ్యానం చేయడమే ఆయనను అనుసరించడమవుతుందని అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా జిల్లాల్లోని క్రైస్తవ మందిరాలన్నీ శుక్రవారం కిటకిటలాడాయి. క్రీస్తును సిలువపై శిక్షించే వృత్తాంతాలను అన్ని చర్చిల్లోనూ కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. తొలుత ఆయా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుద్రంపూర్ సెయింట్ పీటర్స్ చర్చిలో సీఎస్ఐ సంఘం కాపరి ఏసుబాబు, సెక్రటరీ రవి రత్నరాజు, మేరీ కుప్పస్వామి ఆధ్వర్యంలో క్రీస్తు వ్యాక్యాలను స్మరించారు. ఈ వేడుకలకు సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు షాలెంరాజు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే, జిల్లాలోని అన్ని ప్రాధాన క్రీస్తు మందరాల్లోనూ గుడ్‌ఫ్రైడే ప్రత్యేక పార్థనలు జరిగాయి.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

కొత్తగూడెం రుద్రంపూర్ సెయింట్ పీటర్స్ చర్చిలో జరుగుతున్న ప్రార్థనలు

భద్రాచలం: సిలువను మోస్తున్న క్రైస్తవులు

అశ్వారావుపేట రూరల్: కొత్తూరులో వేడుక

ఇల్లెందు రూరల్: సీఎస్ఐ చర్చిలో ప్రార్థన

టేకులపల్లి: ప్రార్థన చేస్తున్న ఫాదర్

పాల్వంచ: సిలువ మోసుకొని వెళ్తూ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

చండ్రుగొండ: ప్రార్థన చేస్తున్న భక్తులు

పాల్వంచలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఇల్లెందు రూరల్: మామిడిగూడెంలో ప్రార్థన

సారపాకలో..

కొత్తగూడెం అర్బన్: గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సాబీర్‌పాషా

పాల్వంచలో..

అశ్వారావుపేట టౌన్ : సిలువలతో ప్రదర్శన

మోటరుకు మరమ్మతులు.. ఆదివాసీలకు తాగునీళ్లు..

బోరును మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

లక్ష్మీదేవిపల్లి, మార్చి 29: మరమ్మతులకు గురైన మోటర్లకు అధికారులు మరమ్మతులు చేయడంతో ఎట్టకేలకు ఆదివాసీలకు తాగునీళ్లు అందుతున్నాయి. వేసవి నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటి ఎద్దడిని నివారించాలని, అన్ని ఆవాసాలకు మంచినీటిని సరఫరా చేయాలని ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. ఈ మేరకు మండల అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవో, సెక్రటరీలు కలిసి మండలంలో మరమ్మతులకు గురైన మోటర్లకు రిపేర్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని క్రాంతినగర్ ఆదివాసీ గూడెంలోని సోలార్ మోటరుకు కూడా శుక్రవారం మరమ్మతులు చేయించారు. దీంతో ఆ ఆదివాసీలకు నీటి సమస్య తీరింది.

అమ్మ మందలింపు.. బిడ్డ బలవన్మరణం

శేఖర్ (ఫైల్)

గుండాల, మార్చి 29: దారి తప్పిన బిడ్డను చూసిన ఏ తల్లికైనా బాధ కలుగుతుంది. బిడ్డను సరైన దారిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంది, మందలిస్తుంది. మండలంలోని పడుగోనిగూడెం పంచాయతీ నాగారం గ్రామానికి చెందిన ఆ తల్లి కూడా అదే పని చేసింది. మద్యానికి బానిసగా మారిన తన కుమారుడు జోగ శేఖర్(29)ను మందలించింది. అతడు మాత్రం దీనిని భరించలేకపోయాడు. క్షణికోద్రేకంలో విచక్షణ కోల్పోయాడు. గురువారం రాత్రి ఇంటి డాబా మీదకు వెళ్లి, పురుగుల మందు తాగాడు. శుక్రవారం తెల్లవారుజామున అపస్మారకంగా పడి ఉన్న అతడిని కుటుంబీకులు, గ్రామస్తులు గమనించారు. 108 సిబ్బంది వచ్చి గుండాల ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే శేఖర్ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు ఏఎస్ఐ ఆర్.వెంకటేశ్వర్లు అప్పగించారు. కేసు నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

శిక్షణ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్

మాట్లాడుతున్న డైరెక్టర్ (పా) శ్రీనివాస్

కొత్తగూడెం సింగరేణి, మార్చి 29: సింగరేణి సంస్థలోని వైద్యులు, సిబ్బంది సీపీఆర్ (అత్యవసర వైద్యం)పై అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కార్పొరేట్, ఏరియా, మణుగూరు, ఇల్లెందులోని సింగరేణి ఆస్పత్రుల వైద్యులకు, స్టాఫ్ నర్సులకు, వార్డు అసిస్టెంట్లకు కొత్తగూడెంలో రెండో రోజు శుక్రవారం ముగింపు శిక్షణ కార్యక్రమం జరిగింది. అత్యవసర చికిత్సలైన బీఎల్ఎస్, ఏఎల్‌సీఎస్, సీపీఆర్ అంశాలపై హైదరాబాద్ జీవీకే ఫౌండేషన్ ఈఎంఆర్ఐ వైద్యులు రెండు రోజులపాటు ఇక్కడి సింగరేణి వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ (పా) శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులకు, కటుంబ సభ్యులకు, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సింగరేణి ప్రధాన ఆస్పత్రి సహా అన్ని ఏరియా ఆస్పత్రులను ఆధునీకరించామని అన్నారు. అన్ని స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండేందుకు వీలుగా ఇటీవల మరికొంత మంది స్పెషలిస్టు వైద్యులను కూడా నియమించుకున్నామని అన్నారు. అత్యవసర సమయాల్లో రోగులకు అత్యవసర చికిత్సలు అందించేందుకు బీఎల్ఎస్, ఏఎల్‌పీఎస్, సీపీఆర్‌లపై సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోని 120 మంది వైద్యులు, 160 మంది స్టాఫ్ నర్సులకు, 1,200 మంది వార్డు అసిస్టెంట్లకు ఈ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సీఎంవో డాక్టర్ సుజాత, ఏసీఎంవో డాక్టర్ విక్టర్ వందనం, డీవైసీఎంవో సునీత, మాట్రోన్ మిస్, డాక్టర్లు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, మాలతి, ఈఎంఆర్ఐ వైద్యులు రవీన్, జావీద్, సతీష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, మార్చి 29: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలవరులను అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలతో అలంకరించారు. దీనినే 'ముత్తంగి అలంకరణ'గా పిలుస్తున్నారు. బేడా మండపంలో స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

స్వామివారి కల్యాణానికి సిద్ధమవుతున్న తలంబ్రాలు

తలంబ్రాలు కలుపుతున్న ముత్తైదువులు

పాల్వంచ, మార్చి 29: పట్టణంలోని శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వచ్చే నెల 3 నుంచి 6 వరకు జరిగే వార్షిక కల్యాణంలో భాగంగా శుక్రవారం మహిళా భక్తులు కల్యాణ తలంబ్రాలు కలిపే వేడుకను నిర్వహించారు. పట్టణంలోని సుమారు వెయ్యి మంది ముత్తైదువులు హాజరై పసుపు కొట్టి స్వామివారి కల్యాణ క్రతువును ప్రారంభించారు. అదే విధంగా స్వామివారి కల్యాణ విశేషాన్ని తెలిపే వీడియో టీజర్‌ను ఆలయ బాధ్యులు ఆవిష్కరించారు. భక్తసమాజ మండలి సభ్యులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, కందుకూరి రామకృష్ణ, పసుమర్తి వెంకటేశ్వరరావు, తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ యువకులను ఏం చేశారో చెప్పాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మావోయిస్ట్ పార్టీ

భద్రాచలం, మార్చి 29: 'దుమ్ముగూడెంలో అరెస్ట్ చేసి, మాయం చేసిన ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ యువకులను ఏం చేశారో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలి' అని, మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. జగన్ పేరుతో ఆ పార్టీ శుక్రవారం లేఖను విడుదల చేసింది. మార్చి 19న గడ్చిరోలీ జిల్లా అహిరి తాలుకా కొల్లమర్క అటవీ ప్రాంతంలోని రేపన్‌పల్లి గ్రామం వద్ద తమ పార్టీకి చెందిన మంగు, వర్గేష్, రాజు, బుద్రాంలను పోలీస్ బలగాలు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశాయని ఆరోపించింది. మంచిర్యాల ఎస్పీ ద్వారా ఇది అమలయిందని, మహారాష్ట్ర పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లుగా చిత్రీకరించారని ఆ లేఖలో పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి విప్లవకారులను హత్య చేస్తున్నది' అని ఆరోపించింది.

వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుంటే కేసులు: డీఎస్పీ

చీటింగ్ కేసు వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, మార్చి 29: నంబర్ ప్లేట్లు లేకుండా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తూ వాహనదారులు నడిపే వారిపై చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ స్పష్టంచేశారు. నంబరు ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి వాటిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కొత్తగూడెం సబ్ డివిజన్‌లో నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రైవ్‌లో భాగంగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్లు లేకండా పట్టుబడిన ఇద్దరు వాహనదారులపై, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ముగ్గురు వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే నేరస్తులు నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి నేరాల నియంత్రణ కోసం ఈ విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రాంతాల్లో నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నెంబర్ ప్లేట్లు టాంపరింగ్ చేసి ఎవరైనా పట్టుబడితే వారిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సీఐలు, ఎస్సైలు ఎం.కరుణాకర్, కే.శివప్రసాద్, కొండపర్తి నరేశ్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను సందర్శించిన డీఎస్పీ

అశ్వాపురం, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన మనుబోతులగూడెం పంచాయతీ వేములూరు, గొందిగూడేన్ని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి సమస్యలున్నా తెలపాలని కోరారు. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖకు లహరి బస్సులు

భద్రాచలం, మార్చి 29: భద్రాచలం నుంచి విశాఖకు ఆర్టీసీ లహరి (నాన్ ఏసీ) బస్ సర్వీసులు శనివారం ప్రారంభమవుతాయని ఆర్టీసీ భద్రాచలం డిపో మేనేజర్ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.00, రాత్రి 9.00 గంటలకు భద్రాచలంలో బయల్దేరతాయని పేర్కొన్నారు. ఇవే బస్సులు విశాఖలో ఉదయం 8.00, రాత్రి 8.45 గంటలకు తిరుగు ప్రయాణమవుతాయని వివరించారు.

రామాలయానికి వీల్ చైర్ అందజేత

భద్రాచలం, మార్చి 29: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్‌ను జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌కు చెందిన హోప్ స్టెప్స్ ఫౌండేషన్ బాధ్యులు శుక్రవారం అందజేశారు. వారిని దేవస్థానం ఈవో రమాదేవి అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, సభ్యులు సిలువేరు హరీష్, కుర్రే శ్రీనివాస్, చెరుకుపల్లి రమేష్, విజ్జగిరి రవితేజ, ఆలయ క్యాంప్ అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

టేకులపల్లి, మార్చి 29: మండలంలో తడికలపూడి పంచాయతీ కోయ్యాతండా గ్రామస్తుడు గుగులోత్ సజాన్ ఇటీవల మృతిచెందాడు. అతడి కుటుంబానికి కోరం యూత్ బాధ్యులు శుక్రవారం 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు ఇచ్చారు. లక్ష్మణ్, బాలు, చందర్, గోపాల్, నారాయణ, మంజి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, మార్చి 29: మండలంలోని కేపీ జగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయంలోని శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద మేళతాళాలతో అర్చన జరిపారు. అమ్మవారికి ఇష్టమైన పసుపు, కుంకమ, గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు జరిపారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మాజీ ఎమ్మెల్యే మెచ్చా పరామర్శ

దమ్మపేట, మార్చి 29: మండలంలోని నాచారం గ్రామస్తుడు గూడపాటి భద్రయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు.

దొంగలు దొరికారు

బూర్గంపహాడ్, మార్చి 29: వ్యవసాయ మోటర్లు, పరికరాలను దొంగతనం చేస్తున్న నలుగురిని రైతులు పట్టుకున్నారు. బూర్గంపహాడ్ శివారులో క్రషర్ మిల్లు సమీపంలో గురువారం అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు ట్రాలీ వాహనంలోకి హెవీ జనరేటర్‌ను ఎక్కిస్తుండగా స్థానిక రైతులు గమనించారు. వారు దగ్గరగా వెళ్లేసరికి ఆ నలుగురిలో ఇద్దరు పరారయ్యారు. మిగిలిన ఇద్దరిని రైతులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

పాల్వంచ రూరల్, మార్చి 29: మండలంలోని కొత్త సూరారంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాల్వంచ రూరల్ పోలీసులు మండలంలోని కొత్తసూరారంలో శుక్రవారం బెల్టుషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కణితి రాములుకు చెందిన బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన పలు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6,240 ఉంటుందని తెలిపారు. రాములుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, మార్చి 28: మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొమరం రాంబాబు(40) గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనప్పుడు పురుగుల మందు తాగాడు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం మృతి చెందాడు. ఆయన భార్య వెంకటమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.